క్లుప్తంగా

అందుబాటులో 4 టన్నుల జొన్న విత్తనాలు

వేమూరు: పశువుల దాణా జొన్న విత్తనాలు 75 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నటుల పశు సంవర్ధక శాఖ ఏడీఏ జనార్దన రావు తెలిపారు. వేమూరు పశు సంవర్ధకశాఖ పరిధిలోని చుండూరు, వేమూరు, కొల్లూరు మండలాల రైతులకు.. జొన్న రాయితీపై కిలో రూ.23లకు ఇస్తున్నట్లు చెప్పారు. నాలుగు టన్నుల విత్తనాలు వచ్చినట్లు తెలిపారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్‌కు రూ.50వేల విరాళం



అమర్తలూరు(వేమూరు): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.50 వేలు నగదు విరాళం అందజేసినట్లు మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ తెలిపారు. అమర్తలూరు మండలం తురుమెళ్లలోని ఎస్ కేడీఆర్ఎం జూనియర్ కళాశాల మాజీ కరస్పాండెంట్ యలమంచి మనోరమ నగదును హెచ్ఎంకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు, ఉపాధ్యాయులు దుర్భ భ్రమరసూరిశ్రీ, శాంతి, అనురాధ, విద్య, గిరిధర్, భాస్కరరావు, సరేష్, కాళిదాసు, శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

మైనార్టీలపై ప్రధాని మోదీ వివక్ష



భట్టిప్రోలు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ ఆశాజనకంగా లేదని, మైనార్టీలను వివక్షకు గురి చేసిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ముస్లిం మైనార్టీస్ నాయకుడు సిరాజుద్దీన్ శనివారం విమర్శించారు. మైనార్టీ సంక్షేమ శాఖకు కేవలం రూ.3,183.24 కోట్లు మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. ఇది గత ఆర్థిక సంవత్సరానికన్నా తక్కువని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కనీసం రూ.50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నేషనల్ మైనార్టీస్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చివరిసారిగా రూ.61 కోట్లు మంజూరు చేయగా... ఈసారి అసలు కేటాయించకపోవడం గమనార్హమన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌కు గతేడాది రూ. 96 కోట్లు కేటాయించగా.. అదికాస్తా రూ.45 కోట్లకు కుదించినట్లు తెలిపారు.

దళిత వాడకు శ్మశానవాటిక స్థలం అప్పగింత



భట్టిప్రోలు: స్థానిక దళితవాడలో దశబ్దాల తరబడి శ్మశానవాటిక లేకపోవడంతో పలు మార్లు స్థానికులు విన్నవించడంతో అధికారులు స్పందించారు. ప్రతి దళితవాడకు ఒక శ్మశానవాటిక ఉండాలనే ఆలోచనతో గత ప్రభుత్వం ఆలోచన చేసింది. శనివారం భట్టిప్రోలు డొంక పోరంబోకులో ఉన్న 1.75 ఎకరాల భూమిని అధికారులు దళితవాడ సంఘ పెద్దలకు అప్పగించారు. ఈ సందర్భంగా వీఆర్వో శివరామ కృష్ణ, గ్రామ సర్వేయర్లు ఇందుకు సంబంధించిన పత్రాలను సంఘ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కనపర్తి కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రవి, సామ్రాట్, సంఘీయులు పాల్గొన్నారు.

కరెంటు తీగలు తగిలి మూడు గేదెలు మృతి

పెదకాకాని: విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యానికి మూడు గేదెలు బలైన సంఘటన కొప్పురావూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శాఖమూరి సాంబయ్య, శ్రీను శనివారం గ్రామ శివారు ప్రాంతానికి పశువుల్ని మేతకు తోలుకెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మేత బాగా పెరిగి ఉండటంతో పాటు అదే ప్రదేశంలో కరెంటు తీగలు తెగి పడి ఉన్నాయి. ఉదయం కరెంటు తీగలు తెగి పడితే మధ్యాహ్నం వరకూ కూడా సిబ్బంది అటువైపు కూడా తిరిగి చూడలేదు. కనీసం సరఫరా కూడా నిలుపుదల చేయలేదు. మేత మేస్తున్న గేదెలు కరెంటు తీగలు తగిలి సంఘటనా ప్రదేశంలో యజమానుల ముందే విలవిల కొట్టుకుంటూ కన్నుమూశాయి. వాటి విలువ రూ. 2 లక్షల దాకా ఉంటుందని, విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంటి తాళం పగలకొట్టి.. రూ.లక్ష అపహరణ

బాపట్లటౌన్: ఇంటి తాళం పగలకొట్టి రూ.లక్ష అపహరించిన ఘటన మండలంలోని హనుమాన్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం హనుమాన్‌నగర్‌కు చెందిన కోకి అంకిరెడ్డి సుబాబుల్ కర్ర వ్యాపారం చేస్తుంటాడు. కర్ర అమ్మిన సొమ్ము రూ.లక్ష ఇంట్లో ఉన్నాయని, ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలకొట్టి నగదు అపహరించారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

అబ్దుల్ కలాం ఆశయాలు ఆదర్శవంతం



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి ఏపీఎం శ్రీమన్నారాయణ నివాళి

కర్లపాలెం: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయాలు ఆదర్శవంతమైనవని డెప్యూటీ తహసీల్దారు సలీమా తెలిపారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి శనివారం రెవెన్యూ సిబ్బందితో కలసి ఆమె నివాళులర్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని అబ్దుల్ ముందంజలో నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు పోలీస్‌రావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆశయాలను సాకారం చేయాలి

బాపట్ల: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య పేర్కొన్నారు. అబ్దుల్ కలాం 9వ వర్ధంతి సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ అబ్దుల్ కలాం సాంకేతిక పరంగా దేశాన్ని ముందుకు తీసుకుపోయారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోర్ల సముద్రాల గౌడ్, గుంజి ఏడుకొండలు, షేక్ నాయిబా, శ్రీనివాసరెడ్డి, డి.ఎలీషా పాల్గొన్నారు. అలాగే దేశ రక్షణ రంగ సార్వభౌమత్వ సాధనలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పాత్ర అద్వితీయమైందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

అబ్దుల్ కలాం దేశానికి మణిహారం

భట్టిప్రోలు: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భారత దేశానికి మణిహారమని మండల సమాఖ్య ఏపీఎం జి. శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. కలాం 9వ వర్ధంతిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఉత్తమ విద్యావేత్తగా, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, సీసీలు కె.రజనికుమారి, కె.సాంబయ్య, అకౌంటెంట్ బి.శిరీష, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామీణులు సహకరించాలని ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు అన్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి, మాట్లాడారు. పరిసరాలు స్వచ్ఛంగా ఉంటేనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. గుంతలు వంటి ప్రదేశాలలోనే కాకుండా ఖాళీ డబ్బాలు, టైర్లు వంటి వాటిలో నీటి నిల్వలు ఉన్న దోమల ఉధృతి పెరిగి అనేక వ్యాధుల బారిన పడేందుకు అవకాశం ఉందన్నారు. అంటువ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉంటుందన్నారు. తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. చెత్తను నిర్ణీత ప్రదేశాలలోనే పడవేయాలని చెప్పారు. బహిరంగ మలవిసర్జన చేయరాదని, మరుగుదొడ్లను మాత్రమే వినియోగించాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ పరిసరాలు పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. 26వ తేదీన గ్రామాలలో ప్రారంభమైన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ఆగష్టు 10వతేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన అవసరం



సమావేశంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి వైద్యాధికారుల్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హాజరైన ఎంపీపీ దాసరి అన్నమ్మ సభ్యుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అధికారుల్ని కోరారు. తొలుత విద్య, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్, పశు సంవర్ధక, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఐసీడీఎస్ శాఖల అధికారులు వారి శాఖల్లో అమలవుతున్న పథకాలు, వాటి అమలును వివరించారు. సర్పంచ్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న కొందరు తీవ్ర అనారోగ్యం పాలై ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరలా ఇప్పుడు వ్యాక్సిన్ అంటే ప్రజలు భయపడిపోతున్నారని, దీనిపై ఆరోగ్య సిబ్బంది అపోహల్ని తొలగించాలని సూచించారు. వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాల్ని గ్రామాలకు ఆరోగ్య సిబ్బంది వచ్చి అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై ఎవ్వరైనా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

'బడిలో బోర్ కొట్టిందేమో'పై విచారణ

ఆయా పాఠశాలల్లో విచారణ జరిపిన ఎంఈవోలు



రావిపాటివారిపాలెం పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణి హెచ్చరించారు. ప్రత్తిపాడు మండలంలోని వంగిపురం ప్రాథమిక పాఠశాల, రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు వేసి వచ్చి ప్రత్తిపాడులో టీడీపీ నాయకులతో కాలక్షేపం చేస్తున్నారంటూ.. శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'బడిలో బోర్ కొట్టిందేమో' కథనంపై జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాధికారులు స్పందించారు. రావిపాటివారిపాలెంలో ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి హెచ్ఎం రవిని విచారించారు. వంగిపురం ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిని కూడా ఆర్‌వీపాలెం స్కూలుకు పిలిపించి విచారించారు. ఎందుకు పాఠశాల సమయంలో బయటకు వెళ్లారని ? ప్రశ్నించారు. ఇద్దరి వద్ద నుంచి లిఖితపూర్వక వివరణలు తీసుకున్నారు. వాటిని జిల్లా విద్యాశాఖాధికారికి పంపినట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు.

బోధనలో మెళకువలు తెలుసుకోండి

రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి

తెనాలిఅర్బన్: బోధనలోని మెళకువలను ఉపాధ్యాయులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. కొత్త పేటలోని సెయింట్ జాయింట్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరుగుతున్న డివిజనల్ స్థాయి టీచింగ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా నేర్చుకున్న తమ అనుభావాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు బోధన విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబు, ఉపాధ్యాయులు పి.దప్మ, యు.ప్రసాద్, జీవీ బాలసుందర్, ఎం.అభిగయల్, ఎస్.విజయలక్ష్మి, కె.శ్రీమన్నారాయణ, కె.పద్మావతి, బీహెచ్ శ్రీధర్, జయప్రకాశరావు, కో–ఆర్డినేటర్ వీరయ్య పాల్గొన్నారు.

సక్రమంగా మూడు బుట్టల విధానం అమలు

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 14 ,31 వార్డులలో శనివారం ఆయన పర్యటించారు. ఆయా వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. ప్రతి రోజు చెత్తను సేకరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆయకట్టు చివరి భూములకు సాగునీరు



నీరు విడుదల చేసి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

కొల్లూరు : పంట కాల్వల ద్వారా ఆయకట్టు చివరి భూముల వరకు సాగు నీరు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ అన్నారు. శనివారం కొల్లూరు లాక్ సెంటర్‌లో పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి పంట కాల్వలకు నీటిని విడుదల చేసి, జల పూజలు నిర్వహించారు. రైతులు తమ కాల్వల పరిధిలోని నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

31న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 31న ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

కర్లపాలెం: మద్యానికి బానిసైన భర్తతో వేగలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బిడారు దిబ్బ గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కర్లపాలెం హెడ్ కానిస్టేబుల్ రహీం రెడ్డి వివరాల మేరకు.. వివరాల మేరకు దుండివారిపాలేనికి చెందిన కుక్కల సీత(25) భర్త శ్రీనివాసరెడ్డితో కలసి బిడారుది దిబ్బ సెంటర్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త మద్యానికి బానిసై తరచూ గొడవపడుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని సీత మన స్థాపానికి గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బంధువులపై రౌడీ షీటర్ దాడి

తెనాలిరూరల్: ఆస్తి విషయమై ఘర్షణ పడి బంధువులపైనే రౌడీషీటర్ దాడి చేసి, గాయపర్చిన ఘటన మండలంలోని పెదరావూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పెదరావూరుకు చెందిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు వెళ్లిన కఠెవరానికి చెందిన రౌడీషీటర్ బారీ సైదా వృద్ధురాలి ఆస్తి విషయమై బంధువులతో ఘర్షణపడ్డాడు. రాడ్డుతో పలువురిపై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాడు. దీనిపై రాత్రి వరకు రూరల్ పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదు. తమకు వచ్చిన సమాచారం మేరకు విచారణ ప్రారంభించారు.

వ్యాపారిపై దాడి కేసులో పది మంది అరెస్ట్

తెనాలిరూరల్: అనధికార కట్టడం వివాదంలో వ్యాపారిపై దాడి చేసిన కేసులో రౌడీషీటర్ సహా 10 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని నందులపేటకు చెందిన వ్యాపారి అంచె నరేంద్ర కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది ఈ నెల 25వ తేదీన దాడి చేసి గాయపర్చిన సంగతి తెలిసిందే. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో రౌడీషీటర్ కొడాలి గోపీకృష్ణ అలియాస్ జైంటీ నిందితుడిగా ఉండడంతో న్యాయమూరి ఎదుట హాజరుపరచగా స్టేషన్ బెయిలు ఇచ్చే కేసు అని పేర్కొన్న న్యాయమూర్తి రౌడీషీటర్‌కు రిమాండ్ విధించేందుకు నిరాకరించారు.

తహసీల్దారు శ్రీనివాసులు బదిలీ

కొల్లిపర: సార్వత్రిక ఎన్నికలలో బదిలీపై నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు శనివారం ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు అదే జిల్లాకు బదిలీపై వెళ్లారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ ఆయనను శాలువాతో సత్కరించారు. మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా జె.వెంకటసూర్యనారాయణమూర్తి బాధ్యతలు చేపట్టారు. వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్ ఈమని సురేంద్ర రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు నడుం కట్టాలి



కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రదర్శన

కొల్లూరు : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడ పిల్లలకు పెళ్లీడు వచ్చే వరకు తల్లిదండ్రులు వివాహం చేయరాదని, సరైన వయస్సు లేకుండా వివాహాలు చేస్తే.. బాలికలు అనేక అనారోగ్యాల బారిన పడి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే ముప్పు ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు అవగాహన రాహిత్యంతో బాల్య వివాహాలు చేస్తున్న పక్షంలో తమకు సమాచారం అందించాలని సూచించారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం ఉషాకుమారి, అంగన్‌వడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామ్ ఆయిల్ సాగుపై అవగాహన



రైతులకు అవగాన కల్పిస్తున్న అధికారులు..

చుండూరు(వేమూరు): పామ్ ఆయిల్ సాగు వల్ల అధిక లాభం సాధించవ్చని అజంతా సోయా లిమిటెడ్ టెక్నికల్ కన్సల్టెంట్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో పామ్ ఆయిల్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ స్థాపించడానికి.. నర్సరీ మొక్కలు సరఫరాకు అజంత సోయ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం అనుమతి లభించిందని తెలిపారు. జిల్లాలో పంట అభివృద్ధికి చుండూరు మండలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. రైతులందరు పూర్తిగా సహకారించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని చెరుకుపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కాటూరి లక్ష్మీనారయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం ఎన్ఈపీ–2020 నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం 6వ రోజు మండలంలోని అన్ని పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ మా ట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా ప్రతి ఒక్క రూ ఆహ్లాదకరమైన వాతావరణలో గడుపుతారన్నారు. ఎంఈవోలు టి.నవీన్‌కుమార్, పులి లాజర్, గుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.కవిత, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విజ్ఞాన వ్యవస్థపై వ్యాస రచన పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు, రామారావు తదితరులు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల, మోతడక కళాశాల, చలపతి పూర్వ విద్యార్థుల సంఘం, హైదరాబాద్ బలెంఫార్ ప్రైవేట్ లిమిటెడ్, మెదక్ జైంత్ హెల్త్‌కేర్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ విజ్ఞాన వ్యవస్థలు' అనే అంశంపై జాతీయ స్థాయిలో వ్యాసరచన పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంనందున్న కళాశాలలో శనివారం వ్యాసరచన పోటీల కరపత్రాల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆగస్ట్ 5వ తేదీలోపు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలతో రూ. 100 రుసుంను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని, గూగుల్ ఫామ్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను వెలికి తీయడం ఈ వ్యాసరచన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సూచించిన నియమనిబంధనల్ని అనుసరిస్తూ వ్యాసాల్ని ఈపీఈఎన్‌టీఎస్‌సీఎల్‌పీటీ: జీ మెయిల్‌కు పంపాలని సూచించారు.

విద్యార్థుల్లో మనో వికాసానికి వర్క్ షాపులు దోహదం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శేఖర్

గుంటూరు రూరల్: వర్క్‌షాపులు, శిక్షణలు విద్యార్థుల్లో సృజనాత్మకత, మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు. నల్లపాడులోని కళాశాలలో శనివారం లైఫ్ ఫర్ యంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్‌స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కృషితోనే ఉన్నత శిఖరాల్ని చేరతారని తెలిపారు. లైఫ్ స్కిల్స్ కోచ్ ఆచార్య రమణేశ్వర్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు సమాంతరంగా జీవన నైపుణ్యాల్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. కుటుంబ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా లైఫ్ స్కిల్స్ కార్యక్రమాలు వచ్చి చేరాయని తెలిపారు. ఫౌండేషన్ సీఈవో ఎ. భానుప్రకాష్ మాట్లాడుతూ లైఫ్ స్కిల్స్‌కి సమాజంలో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి శ్రద్ధ తీసుకోండి



పారిశుద్ధ్య కార్మికులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ విష్ణు ప్రసాద్

కొల్లిపర: ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ బీవై విష్ణు ప్రసాద్ సూచించారు. శనివారం మండలం కేంద్రంలోని పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైడ్ డ్రెయిన్లలో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పూడిక తీసిన తరువాత వచ్చిన వ్యర్థాలను వెంటనే తరలించి బ్లీచింగ్, చల్లాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా ఉన్నప్పుడే దోమలు అభివృద్ధి అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.